మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## మా గ్రామానికి బస్సు రావాలి



ధర్నా చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ఉమ్మడి మండలంలోని దాసరపల్లి గ్రామానికి ఆర్టీసి బస్సు సర్వీస్‌ను నడపాలంటూ గ్రామానికి చెందిన గ్రామస్తు లు డిమాండ్ చేస్తూ గురువారం ఆత్మకూర్,దేవరకద్ర ప్రధాన రహదారిపై గ్రామ గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడు తూ ప్రతిరోజు అర కిలోమీటర్ మేర కాలినడకన రావాలంటే ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకుని మహబూబ్‌నగర్ డిపో మేనేజర్‌తో, దాసర్‌పల్లి గ్రామస్తుల డిమాండ్‌ను వివరించగా డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు. – చిన్నచింతకుంట,జులై 25 ప్రభాతవార్త

## ఏసీబీ వలలో మండల సర్వేయర్..


ఏసిబికి పట్టుబడ్డ సర్వేయర్

**మక్తల్,జులై 25 ప్రభాతవార్త :** మక్తల్ మండల తహసిల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో మండల సర్వేయర్ బాలరాజు అడ్డంగా దొరికిపోయారు. మక్తల్‌కు చెందిన ఒక రైతు నుంచి భూసర్వే విషయంలో సానుకూలంగా వ్యవహరించేందుకు గాను సర్వేయర్ బాలరాజు లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రైతు నుంచి రూ. 9 వేలు లంచి తీసుకుంటూ ఉండగా, ఏబిబి డీఎస్పీ కృష్ణయ్యగౌడ్ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో మక్తల్ తహసిల్దార్ కార్యాలయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పకడ్బందిగా పూర్తి చేయాలి

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**


విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

**కల్వకుర్తి, జూలై 25 ప్రభాతవార్త:**ఈ నెల 28న కల్వకుర్తి పట్టణానికి రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటనను అత్యంత పకడ్బందిగా ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రమాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన జైపాల్‌రెడ్డి విగ్రహ పరిసరాలను పూల మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దాలని పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే బహిరంగ ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. వీఐపీ గ్యాలరీ, సీఎం సభ స్థలం, ప్రజలకు కావాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సీఎం సభ వేదికను రానున్న మూడు రోజుల పాటు వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు అనుకూలమైన సభ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, తహసీల్దార్లు ఇబ్రహీం, రవికుమార్‌తో పాటు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## చదువుతోనే .. ఉజ్వల భవిష్యత్తు..!

- స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దండి
- మహిళల్లో సామాజిక స్పృహ ఉండాలి
- సమీకృత గురుకుల పాఠశాల స్థల పరిశీలన
- జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి


విద్యార్థినీలతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్


మహిళా సమైక్య సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


దమగ్నాపూర్‌లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**చిన్నచింతకుంట,జులై 25 ప్రభాతవార్త :** చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని అలాంటి చదువును నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి అన్నారు. గురువారం మండలంలో ప్రభుత్వ పాఠశాల ప్రభుత్వ కార్యలయాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పెద్ద వడ్డేమాన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. లక్ష్యాన్ని ఎంచుకొని విద్యలో రాణించినప్పుడే ఆ లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. ఇప్పటి నుంచి మంచి ప్రవర్తనతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను చక్కగా చదువుకొని ఇటు పాఠశాలకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని, బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు అడ్మిషన్ అయ్యారు. 10వ తరగతిలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నా వివరాలను జిహెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం దమగ్నాపూర్‌లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి గాను స్థలాన్ని పరిశీలించారు.

**స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలి....**

ప్రస్తుతం వర్షాకాలంలో అపరిశుభ్రతకు తావీయకుండా ఎప్పటికప్పుడు గ్రామ కార్యదర్శులు పరిశుభ్రతపై దృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలుగా మార్చాని జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి ఆదేశించారు. గురువారం మండల పర్యటనలో భాగంగా ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. త్రాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన త్రాగునీరును ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. వారానికి ఒకమారు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. మిషన్ భగీరథ నీళ్ల తాగడంతో దురద వస్తుందని కలెక్టర్ దృష్టికి మహిళలు తీసుకురాగా వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించాలని ఆదేశించారు.

**మహిళలలో సామాజిక స్పృహ ఉండాలి..**

మహిళా సమాఖ్యలో పని చేస్తున్న మహిళలు సామాజిక స్పృహ కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మండల మహిళా సమాఖ్య సమావేశ హాల్లో గ్రామ సమాఖ్య అధ్యక్షుల విసి సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలలో మహిళా సమాఖ్య సభ్యులను కమిటీ సభ్యులుగా చేర్చిందని ఈ కమిటీలలో ఉండే మహిళా సభ్యులు విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వ పాఠశాలల పనితీరు గమనిస్తూ విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకై మహిళా సమాఖ్యలు పని చేయాలని ఆమె సూచించారు. గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు తమ పిల్లలకు భావించి వారిని మంచి ప్రవర్తనతో చదువుకునేలా అమ్మ ఆదర్శ కమిటీలు పని చేయాలన్నారు. మహిళా సమాఖ్యలోని సభ్యులు ఆర్థిక వనరులే కాదు సామాజిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి, ఏపిఎం విష్ణుచారి, ఎపిఓ నవీన్‌కుమార్, ఎంపిఓ అనిల్‌కుమార్, ఎస్సై ఆర్.శేఖర్ తదితరులు ఉన్నారు.

## ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయొద్దు

**సైబర్ నేరాలపై జాగ్రత్తలు అవసరం మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్**


ఎస్పీ జానకి ధరావత్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 25 ప్రభాతవార్త :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ సూచించారు. సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకుని సైబర్ నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారని ప్రజలు అనవసర లింక్‌లు క్లిక్ చేయొద్దని, ఓటిపి, పాస్‌వర్డ్‌లు ఎవరికి చెప్పొద్దని అప్రమత్తతతోనే మోసాలకు చెక్ పెట్టాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని ప్రజలు, విద్యార్థులు – మిగతా4లో..

## 27 మందికి 26 మంది ఓకే..

## జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాస తీర్మాణంలో పాల్గొన్న కౌన్సిలర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 25 ప్రభాతవార్త :** గతకొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలకు, జడ్చర్ల మున్సిపాలిటీ కౌన్సిలర్లు ప్రజల్లో నెలకొన్న ఉత్కంఠకు స్థిరపడింది. ఎట్టకేలకు గురువారం ఆర్డీఓ సమక్షంలో జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణం నెగ్గింది. దీంతో జడ్చర్ల మున్సిపాలిటీ తొలి ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవిందర్ తన పదవిని కోల్పోయారు. ఇటీవల నిర్వహించిన జడ్చర్ల మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో ఛైర్‌పర్సన్‌పై అవినీతి ఆరోపణలను మోపుతూ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన సంగతి తెలిసిందే. అదేరోజు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్ విజయేంద్రబోయికి అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టాలంటూ లేఖను అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ ఆధ్వర్యంలో జడ్చర్ల మున్సిపాలిటీలో అవిశ్వాస బలనిరూపణ సమావేశాన్ని గురువారం ఏర్పాటుచేశారు. జడ్చర్ల మున్సిపాలిటీలో మొత్తం 27 మంది సభ్యులు ఉండగా ఛైర్‌పర్సన్ లక్ష్మి మినహా 26 మంది అవిశ్వాసానికి మద్దతు తెలపడంతో ఛైర్‌పర్సన్ తన పదవిని కోల్పోయారు.

**నూతన ఛైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ....**

జడ్చర్ల మున్సిపాలిటీ ఏర్పడ్డాక ఎన్నికైన తొలి మున్సిపల్ ఛైర్మన్‌పై – మిగతా4లో..

## ముస్సిపాలిటీల్లో, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి..

**వనపర్తి జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్**


పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి అని స్కూల్ తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి జులై 25 ప్రభాతవార్త :** మున్సిపాలిటిల్లో, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం ఉదయాన్నె వనపర్తి, పాన్‌గల్ మండలాల్లో పర్యటించి పరసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉదయాన్నె వనపర్తి మున్సిపాలిటిలోని 10వ వార్డులో తిరిగి డ్రైన్ ల పరిస్థితి పరిశీలించారు. ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను ప్లాటు యజమానులు తొలగించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, యజమానులు శుభ్రం చేయని పక్షంలో మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి యజమానిపై జరిమాన విధించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైన్‌లు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ నీరు సాఫీగా వెళ్లే విధంగా చూసుకోవాలని సూచించారు. గోప్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే గ్రామంలో నర్సరీని సందర్శించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఉపయోగిస్తున్న – మిగతా4లో..

## ఇష్టంలేని పెళ్లికి వచ్చిన పెళ్లికొడుకు కెసిఆర్

**మాది ప్రజా సంక్షేమ బడ్జెట్**

**విద్యా, వైద్యం మహిళా సంక్షేమానికి పెద్దపీట**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 25 ప్రభాతవార్త :** ఇష్టలేని పెళ్లికి వచ్చిన పెళ్లి కొడుకు కెసిఆర్ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. బడ్జెట్ సమావేశాల అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, డా.వంశీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు చూడలేమనుకొన్నది చూడరు అనుకున్నది తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు వీక్షించారని ఆయన అన్నారు. మాట్లాడడానికి వీలులేదని మీడియా పాయింట్‌నే బహిష్కరించి నిషేధించిన గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని కానీ ఈరోజు అదే మీడియా పాయింట్ వద్ద కెసిఆర్ బడ్జెట్ గురించి మాట్లాడడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎట్లా ఉండాలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థమైందని ఆయన చెప్పారు. ఈ బడ్జెట్ ప్రజా సంక్షేమం కోసం, రైతు బాగుకోసం, మహిళా అభివృద్ధి కోసం, విద్యా, వైద్యం బలోపేతం కోసం, యువత నైపుణ్యం శిక్షణ పెంచుట కోసం ఒకటేమిటి ప్రతి ఒక్కరికి మేలుచేసే గొప్ప బడ్జెట్ ఇది అని ఆయన స్పష్టం చేశారు. ఒక్కో పథకానికి ఇప్పటివరకు ఎంత ఖర్చు పెట్టాము, మిగతా నెలలో ఎంత ఖర్చు పెట్టబోతున్నామని స్పష్టంగా పారదర్శకంగా మా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెరిచిన పుస్తకంగా తెలంగాణ ప్రజల ముందుంచారని, తెలంగాణలో వ్యవసాయాన్ని పండగ చేయడానికి 72 వేల కోట్ల రూపాయలను కేటాయించడం దేశంలో ఏ ప్రభుత్వమైనా ఇప్పటివరకు ఇచ్చిందో లేదో తెలియదు కానీ మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఇదే తొలిసారి అని ఆయన స్పష్టం చేశారు. వెనుకబడిన తరగతుల కోసం గత బిఆర్‌ఎస్ పాలనలో 29 వేల కోట్లు ఖర్చు చేసింది. 10 సంవత్సరాల్లో కానీ మొదటి సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పదివేల కోట్లు కేటాయించిందని, మైనార్టీల సంక్షేమం గురించి గతంలో కెసిఆర్ ఎన్నో గొప్పలు చెప్పిండు కానీ గత పది సంవత్సరాల్లో బిఆర్‌ఎస్ పాలనలో ఖర్చు పెట్టింది కేవలం 11వేల కోట్లు మాత్రమేనని మొదటి సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది 3 వేల కోట్లు అని ఆయన గుర్తు చేశారు. దళితబంధు గురించి ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకుంటున్నారు కదా అని ఆరోపణలు చేసిన కెసిఆర్ మరి కమిషన్లు తినే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థించదని అందుకే కమిషన్లు తినే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. అందరికి కూడా ఆరు గ్యారంటీ ద్వారా ప్రతి ఇంటికి ఉపయోగపడే విధంగా ప్రతి పథకాన్ని ఎటువంటి కమిషన్లకు లేకుండా మధ్యవర్తిత్వము దళారులు లేకుండా చేరవేసే విధంగా విధులు కేటాయించామని సంక్షేమానికి కనివిని ఎరుగని రీతిలో 47 వేల కోట్ల రూపాయలను మా బడ్జెట్ ద్వారా కేటాయించామని ఆయన తెలిపారు. రైతు భరోసా చేయూత ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రతి అర్హునికి అందజేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు బడ్జెట్ పూర్తికాగానే ఆదరాబాదరాగా ఏదో మునిగిపోతుందని మేడిగడ్డకు బయలుదేరారని, అప్పుడేమో టూరిస్టులు రావాలి మేడిగడ్డను చూడాలని ప్రకటనలు ఇచ్చుకున్న వ్యక్తులు కూలిపోయిన మేడిగడ్డను చూడడానికి బయలుదేరారని ఆయన ఎద్దేవా చేశారు. నాడు అశోకుడు కళింగ యుద్ధంలో లక్షల మంది ఊచకోతకు కారణమయ్యాడని ఆ మారణహోమం చూసి ఇంత విధ్వంసానికి నేను కారణమయ్యానా అని బౌద్ధ మతం స్వీకరించి జీవనం సాగించారని అలాగే, నేటి మేటిగడ్డ విధ్వంసానికి కారణమైన హరీష్‌రావు నాటి ఇరిగేషన్ మంత్రిగా, ఆర్థిక మంత్రిగా ప్రధాన కారణం అని కనీసం మేడిగడ్డను చూసి అంతటి విధ్వంసానికి కారణం తనే అనే విషయాన్ని గ్రహించి తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయానికి తనే కారణమైన విషయాన్ని గ్రహించి మనసు మార్చుకొని పవిత్రమైన మనసు తోటి తిరిగి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర అభివృద్ధిని కుంటుపర్చే బడ్జెట్

**పేరు గొప్ప ఊరుదిబ్బ అన్నట్లుంది**

**బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారు శాంతికుమార్**



**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 25 ప్రభాతవార్త :** భట్టి విక్రమార్క నేడు ప్రకటించిన బడ్జెట్ పేరు గొప్ప ఊరు దిబ్బ మాదిరిగా ఉందని బిజెపి రాష్ట్ర కోశాధికారి పాలమూరు మోడీ బి.శాంతికుమార్ అన్నారు. 70పేజీల పుస్తకంలో 70అబద్ధాలు, చేతగానమ్మకు మాటలు ఎక్కువ అని భట్టి చెప్పిన మాటలు ఆయనకే వర్తించినట్లు కనబడిందన్నారు. చెప్పుకోవడానికి రూ. 2,91,159 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి, ఖర్చేమో రూ. 2,20,000 వేల కోట్లని, పెట్టుబడి వ్యయం రూ. 33 వేల కోట్లని, ఇది రాష్ట్ర అభివృద్ధిని కుంటుపర్చే బడ్జెట్ అన్నారు. అభివృద్ధికి తిరోగమనమయ్యే బడ్జెట్. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే బడ్జెట్ అని, అభివృద్ధి కుంటుపడితే వచ్చే తరాలు నష్టపోతాయన్న కనీస పరిజ్ఞానం లేని ఈ ప్రభుత్వం పెట్టుబడులకు తక్కువ ఖర్చు చేయడం దురదృష్టకరమన్నారు. రైతులను నడిఏట్లో ముంచే బడ్జెట్ అని ఆరోపించారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ. 72,659 కోట్లు ప్రకటించారు. అందులో రుణమాఫీకే సింహభాగం కేటాయించారని, రైతుభరోసా ఎక్కడ? కౌలు రైతులు, రైతుల కూలీల సంక్షేమం ఎక్కడ? నిధులేవి? ఫసల్‌భీమా యోజన ఏది? రైతు భీమా ఏది? ఇతర వ్యవసాయ సబ్సిడీలు ఏవి? వ్యవసాయ అనుబంధ రంగాలకు సబ్సిడిలేవి? అని ప్రశ్నించారు. సాగునీటికి రూ. 26 వేల కోట్లు ఇచ్చామంటున్నారు. పాలమూరు రంగారెడ్డి, డిండి, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎంత ఇచ్చారు? ఆ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించే దమ్ములేదా అని విమర్శించారు.

## మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యంకు ఘన నివాళి

**జడ్చర్ల, జులై 25 ప్రభాతవార్త :** జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం 67వ జయంతి డా.బి. ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. చికూరి శివ అధ్యక్షత న సమావేశం నిర్వహించారు. పాలమూరు ముద్దుబిడ్డ ఎంతో మందికి బాట చూపిన వ్యక్తి అని మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ పిట్టల మురళి, తెలుగు సత్తయ్య, మాజీ సర్పంచ్ రేణుక మాట్లాడారు. ఎర్రసత్యం జడ్చర్ల ఎమ్మెల్యే అయినందుకు ముదిరాజ్ బిడ్డలుగా గర్విస్తున్నామని సంతోషిస్తున్నామన్నారు. బిసిలలో అత్యధిక శాతం ముదిరాజ్ బిడ్డలకు అన్యాయం జరుగుతుందని బిసి డి గ్రూప్ నుండి ఏ గ్రూపుకు మార్చాలని ముదిరాజ్‌లు ఉన్న గ్రామాలలో ముదిరాజ్ సోదరులందరికి నీటి వనరులపై అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చికూరి శివ, విడియో శ్రీనివాస్, కె. శాంతయ్య, బత్తుల నర్సింలు, చంద్రమౌళి, ఎడ్ల బాబన్న, కటమోని బాలు, లక్ష్మమ్మ, గడ్డిపండు, మురళీకృష్ణ, పండ్ల శేఖర్, అనంతకిశోర్, రాఘవేందర్, శ్రీనివాసులు, రాధాకృష్ణ, టవర్‌శివ, పద్మ కృష్ణ, వెంకటేష్, శ్రీను, గోనెల రాము, శ్రీధర్ పాల్గొన్నారు.



## గోల్డ్ మెడల్ సాధించిన గద్వాల విద్యార్థిని కుమారి సహస్ర రెడ్డి

**గద్వాల జులై 25 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన శ్రీదేవి, శ్రీధర్ రెడ్డిల ఏకైక కుమార్తె, సీనియర్ జర్నలిస్టు జనార్దన్ రెడ్డి, మనుమరాలు, సహస్రరెడ్డికి 2020-24 సంవత్సరానికి గాను గీతం యూనివర్సిటీ విశాఖపట్నం నందు సిఎస్ కంప్యూటర్, సైబర్ సెక్యూరిటీ విభాగంలో క్లాస్ ఫస్టు గాను గోల్డ్ మెడల్ సాధించింది. ఇట్టి గోల్డ్ మెడల్ గురువారం గీతం యూనివర్సిటీ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మర్ మేనేజింగ్ డైరెక్టర్ శిల్ప గుప్తా, గీతం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా డిగ్రీ సర్టిఫికెట్, ర్యాంకు కార్డు తీసుకోవడం జరిగింది. గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా అపార్ట్‌మెంట్ యజమానులు జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## అధికారుల తీరుకు నిరసనగా మహిళల ధర్నా

**ఆత్మకూర్ జులై 25 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో అధికారులు తీరు నిరసిస్తూ గురువారం రోజు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మహిళలు ధర్నా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వృద్ధులు వికలాంగులకు ఒంటరి మహిళలకు పోస్ట్ ఆఫీస్ ల ద్వారా పెన్షన్లు అందజేస్తున్న అధికారులు గర్జన రెండు నెలలుగా పెన్షన్లు పంపిణీ చేయడంలో తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించిన మహిళలను అమర్యాదగా సంబోధిస్తూ పెన్షన్లు పంపిణీ చేయడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మహిళలు గాంధీ చౌరస్తాలో ధర్నాకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు ఎస్సై నరేందర్ మహిళల వద్దకు చేరుకొని కార్యాలయ అధికారులతో చర్చించిన అనంతరం పెన్షన్లు పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టమై హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. మహిళల ధర్నా మూలంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు కొద్దిసేపు ఇక్కట్లకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో మండలములోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా వీరారెడ్డి జయంతి వేడుకలు



**ఆత్మకూర్ జులై 25 ప్రభాతవార్త :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రభుత్వ చీఫ్ అమరచింత మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు వీరారెడ్డి జయంతి ఉత్సవాలను గురువారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా జరుకున్నారు. నారాయణ పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరులోని గాంధీ చౌరస్తాలో వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అమరచింత నియోజకవర్గం అభివృద్ధి కోసం వీరారెడ్డి చేసిన సేవలను కొనియాడారు అనంతరం ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకు ముందుగా ప్రశాంత్ కుమార్ రెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో వీరారెడ్డి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ ఎంపీపీ గంగాధర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు వినయ్ కుమార్ రెడ్డి ,మొగలి గంగాధర్ గౌడ్ ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రహమతుల్లా తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు భయపడం..

**బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి, మెరువ రాజు**



**అమరచింత జులై 25 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో నిరుగ్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఉద్యోగాలు ఇవ్వాలని బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం ఆరెస్టులతో భయపెడుతుందని బీజేవైఎం కార్యకర్తలు ఆరెస్టులకు భయపడరని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి , మెరువ రాజు అన్నారు. నిరుగ్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన పిలుపులో భాగంగా పోలీసులు ముందస్తుగా బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని లేనిచో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్ యాదవ్, రాకేశ్ శెట్టి, కే నాగరాజ్, మన్యం రెడ్డి, సుతారి లక్ష్మన్న, కొల్లంపల్లి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

# బిసిలకు రిజర్వేషన్ పెంచాలి

### ఎమ్మార్వోకు వినతిపత్రం ఇచ్చిన బిజెపి నాయకులు

**గద్వాల,జులై 25 ప్రభాతవార్త:** బిజెపి మహబూబ్‌నగర్ పార్లమెంటు ఎంపీ డీకే అరుణ సూచన మేరకు, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, బీసీలకు రిజర్వేషన్ పెంచాలని డిమాండు చేస్తూ గద్వాల డిప్యూటీ తహసీల్దార్ శివకి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు కింది విషయాలపై హామీ ఇచ్చారని, వాటిని అమలు పర్చాలని డిమాండు చేశారు. రిజర్వేషన్లు ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని అది అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్ మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గొల్ల, కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్దిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెక్షన్ లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి 20 వేల కోట్ల రూపాయలు చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామి ఇచ్చి 8 నెలల గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదన్నారు. అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పోరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరువ్యాపారాలు నిర్వహించుకునేందుకు, ఉన్న విద్య కోసం వడ్డీ లేకుండా, పూచికత్తుల లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారు. సమయం గడుస్తున్నప్పటికి రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్యసంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు ఆహ్వానించి 100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెర లేపినట్టుగా అర్థమవుతుందన్నారు. ముదిరాజ్, గంగపుత్ర గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్ని క్యాబినేట్లో నిర్ణయాలు గాని తీసుకోలేదు. పై విషయాలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మీకు నిరజనగా తెలియజేస్తూ తద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం అయిందన్నారు. ప్రభుత్వం వెంటనే వారం రోజుల్లో పై విషయాల పైన చర్యలు ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లతో ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షులు దేవదాసునాయుడు, బిజెపి సీనియర్ నాయకులు సంజివ భరద్వాజ్, మిర్జాపుర వెంకటేశ్వర రెడ్డి, గద్వాల్ పట్టణ అధ్యక్షులు నరసింహ, కార్యదర్శి సోమశేఖర్, సంగల పవన్, తిమ్మన్న, రిషిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఇంచార్జి ఎమ్మార్వోకు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

## 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు

**గద్వాల జులై 25 ప్రభాతవార్త:** 14 సంవత్సరాలలోపు మైనర్ పిల్లలను పనిలో పెట్టుకుంటే ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు హెచ్చరించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని తన ఛాంబర్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ జులై 1 నుండి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందని అన్నారు. బాల్యాన్ని బాలల హక్కులను హరించడం నేరమని, 14 ఏళ్లలోపు చిన్నారులు చదువుకునేందుకు బడుల్లో ఉండాలే తప్ప పనిలో ఉండకూడదని అన్నారు.పనిలో పెట్టుకునే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుబడిన బాల కార్మికులను వారు తిరిగి చదువుకునేందుకు వసతి గృహాల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. బాల కార్మికులతో పాటు బిక్షాటన, చెత్త సేకరించుకునే బాలలు,వీధి బాలలు కూడాఆపరేషన్ ముస్కాన్ లో గుర్తించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ టీములు చురుకుగా పని చేస్తున్నాయని ఇప్పటి వరకు 14 మంది బాల కార్మికులను రక్షించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేలా సంభంధిత శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. ఇటుక బట్టిల్లో, భవన నిర్మాణాల్లో పనిచేసే పిల్లలను గుర్తించి వారిని కాపాడాలని డీసిపీఓలను ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంను సమిష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా శిశు సంక్షేమ అధికారిని సుధారాణి జిల్లా విద్యాశాఖఅధికారిని ఇందిర, చైల్డ్ వెల్ ఫేర్ చైర్ పర్సన్ సహదేవుడు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, సిడిపిఓలు, ఎన్‌జీఓలు, చైల్ లైన్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్నా అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఈఓ ఇందిర, డిడబ్ల్యూఓ సుధారాణి

## బాధిత కుటుంబాలను పరామర్శించిన సరితమ్మ..

### మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకుంటం

### మాజీ జెడ్పిచైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరితమ్మ

**గద్వాలటౌన్ జులై 25 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌తో మృతి చెందిన కుటుంబాలను మాజీ జెడ్పిచైర్మన్, కాంగ్రెస్ ఇంచార్జి సరితమ్మ పరామర్శించారు. గురువారం నియోజక వర్గంలోని కేటిదొడ్డి మండలం గంగన్‌పల్లి గ్రామానికి చెందిన గిర్నీ జంగిలమ్మ వ్యవసాయ పొలం వద్ద పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను సరితమ్మ పరామర్శించారు.అదేవిధంగా కొండాపురం గ్రామానికిచెందిన వడ్డె గోవిందు కుమారుడు నర్సింహులు విద్యుత్ షాక్ తో మృతి చెందగా యువకుడి కుటుంబ సభ్యులను, కొండాపురం గ్రామానికి చెందిన వడ్డె సవారమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతురాలు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. విద్యుత్ షాక్ తో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆదుకుంటామని సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు మృతుల కుటుంబసభ్యులకు త్వరితగతిన నష్టపరిహారం అందేలా కృషి చేయాలని సరితమ్మ సూచించారు. ఈ పరామర్శలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల రాజశేఖర్ రెడ్డి, జమ్మిచెడు ఆనంద్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, కుర్వ శ్రీనివాసులు, నరేశ్,నరం రంగారెడ్డి, వడ్డె వెంకట్రాములు, బి.మహానంది రెడ్డి, గంగన్‌పల్లి చిన్న నర్సింహులు, నందిన్నె వెంకటేశ్, రాఘవేంద్ర, ఆంజనేయులు, రామన్ గౌడ్, బంగి నవీన్, కావాలి జయన్న, గడ్డమీది అంజనప్ప, పల్లెన్న తదితరులు ఉన్నారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సరితమ్మ

## రాష్ట్ర బడ్జెట్‌లో రైతుల భవిష్యత్తుకు అడుగులు..

### వ్యవసాయ రంగానికి బడ్జెట్లో పెద్ద పీట.. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి

**కొత్తకోట జులై 25 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో గురువారం ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతాంగానికి భవిష్యత్తుకు అడుగులు వేస్తూ అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ఉందని వ్యవసాయా రంగానికి బడ్జెట్ లో పెద్దపీట వేసిందని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక వార్షిక బడ్జెట్ 2,94,159 లక్షల కోట్ల బడ్జెట్ల వ్యవసాయ శాఖకు 72,659 కోట్లు, ఉద్యానవనం రూ.737 కోట్లు, సాగునీటి రంగానికి 26 వేల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,980 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి రైతు సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి రాష్ట్రంలో చివరి రైతు వరకు సంక్షేమ ఫలాలు అందలనేదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అన్నారు. ప్రతిపాదిత బడ్జెట్లో సింహ భాగం వ్యవసాయ రంగానికి కేటాయించడం ఇది రైతుల తలరాతలు మార్చే ఒక చారిత్రత్మకమైన ఈ వ్యవసాయ బడ్జెట్ తో ఇది రైతు ప్రభుత్వం నిరూపితమైందని బడ్జెట్‌లతో మరోసారి రుజువైందని పేర్కొన్నారు. పైసా ఖర్చు లేకుండా రైతు పంట భద్రతకు పంటలు భీమా పథకం ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకుంటుందని ఈ బడ్జెట్‌లో ప్రవేశ పెట్టడం సంతోషదాయకమని తెలిపారు. అదేవిధంగా ఆర్థిక భద్రత కరువై పని దొరకని రోజుల్లో రైతు కూలీలు పనులు ఉండకుండా వారందరిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బడ్జెట్లో భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12000 వేలందిస్తామని బడ్జెట్ లో పేర్కొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి పి మోహన్ రెడ్డి, పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగు బాల్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ మండల శాఖ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## ఏపీలో అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులకు, ఆరోగ్యశ్రీ అమలు చేయాలి

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ని కలిసి వినతిపత్రం ఇచ్చిన అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల జులై 25 ప్రభాతవార్త:** అల్లంపూర్ నియోజకవర్గానికి పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు పట్టణంలో ఉన్న ఆసుపత్రులలో నియోజకవర్గ ప్రజలకు జర్నలిస్టులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందించాలని కోరుతూ గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే అల్లంపూర్ చౌరస్తాలో గల వంద పడకల ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అమలు చేసి అందుబాటులోకి తీసుకుని వచ్చి సిబ్బందిని నియమించాలని అలాగే గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశాకార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలని వైద్యశాఖ మంత్రిని ఎమ్మెల్యే కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహ తామిచ్చిన వినతి పత్రంపట్ల సానుకూలంగా స్పందించినట్లు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోట్ల అశోక్ రెడ్డి, పుల్లూరు రఘురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి విన్నవించిన అలంపూర్ ఎమ్మెల్యే

## ఎల్‌ఓసి లెటర్‌ను అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల జులై 25 ప్రభాతవార్త:** హైదరాబాదులో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండల చెందిన పద్మ తండ్రి సవారన్న కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి 2 లక్షల 50 వేల ఎల్‌ఓసి లెటర్‌ను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయిన 2 లక్షల 50 వేల రూపాయలు ఎల్‌ఓసి లెటర్‌ను సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**గద్వాల టౌన్ జులై 25 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని కృష్ణనది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూరాల ప్రాజెక్టు అధికారులు హెచ్చరిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి డ్యాం నుండి భారీ వరద ప్రవాహం జూరాల ప్రాజెక్టుకు చేరుకోవడంతో 46 గేట్లు ఎత్తి దిగువకు కృష్ణమ్మా వరద నీటిని విడుదల చేయడంతో, దిగువకు శ్రీశైలం మల్లన్న స్వామి వైపుకు కృష్ణమ్మ ఉగ్రరూపంతో ప్రవహిస్తుంది. సుమారు 2 లక్షల 50 వేల క్యూసెక్కుల వంద నీటిని విడుదల చేశారు. దీంతో నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు ఎవరు కూడా నది వైపు వెళ్లవద్దని సూచించారు.

## ఆత్మకూర్ ఎంపీఓగా శ్రీరామ్ రెడ్డి



**ఆత్మకూర్ జులై 25 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండల ఎంపీఓగా శ్రీరామ్ రెడ్డి గురువారం రోజు బాధ్యతలు తీసుకున్నారు.వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండల ఎంపిఓగా పనిచేస్తున్న శ్రీరామ్ రెడ్డి ఆత్మకూరుకు బదిలీ కావడంతో గురువారం రోజు ఎంపీఓగా బాధ్యతలు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామా లకు చెందిన ప్రజలకు తను ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు కొనసాగిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఉప్పునుంతల తహసిల్దార్‌గా సునిత



**ఉప్పునుంతల,జులై 25 ప్రభాతవార్త:** ఉప్పునుంతల తహసిల్దార్‌గా ఎం.సునిత బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహసిల్దార్ శ్రీకాంత్ సూర్యాపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సిసిఎల్ నుంచి వచ్చిన సునిత ఉప్పునుంతల తహసిల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

## బాలానగర్ బిజెవైఎం నాయకుల ముందస్తు అరెస్టు



**బాలానగర్,జులై 25 ప్రభాతవార్త :** ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి చేపట్టిన బిజెవైఎం నాయకులను బాలానగర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను ఈ ప్రభుత్వం అణిచివేస్తోందని ఈ సందర్భంగా బిజెవైఎం నాయకులు మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయకపోతే ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగులకు అండగా మేము ఉంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రియాంబర్సమెంట్ రూ. 6500 కోట్లు విడుదల చేయాలని, గ్రూప్1లో 1:100 క్వాలిఫై చేయాలని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో బిజెవైఎం బాలానగర్ మండల అధ్యక్షులు కుమార్‌నాయక్, బిజెవైఎం ఉపాధ్యక్షులు తరుణ్, నందు, బిజెవైఎం ఉపాధ్యక్షులు తరుణ్, నందు, బిజెవైఎం మండల సెక్రెటరీలు సాయికుమార్, వెంకటేష్, బిజెపి వీరన్నపల్లి సెక్రెటరీ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# బాలుడిపై గ్రామ సింహాల దాడి

### కుక్కల దాడి నుంచి చిన్నారులను కాపాడాలని పట్టణ ప్రజల వినతి


కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

**అయిజ జులై 25 ప్రభాతవార్త:** పట్టణంలోని కర్నూల్ చౌరస్తా నందు కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన భీమేష్ రెడ్డి కుమారుడు వాళ్ల షాపు దగ్గర ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో గాయపడి బాలుడినీ కర్నూల్‌లోని ప్రైవేట్ హస్పిటల్లో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అనేక చోట్ల కుక్కల దాడిలో మరణించిన చిన్నారులను సైతం చూస్తున్నాం.మన అయిజ పట్టణంలో కూడా నిరంతరం చిన్నారులపై కుక్కల దాడి తెలియపరుస్తున్నప్పటికి మున్సిపాలిటీ నాయకులుగానీ, అధికారులు కాని ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియ జేస్తుంది. నిన్న 16వ వార్డులో స్కూల్ పిల్లలపై కుక్కల దాడి గురించి సోషల్ మీడియా ద్వారా తెలియపరిచిన ఎలాంటి స్పందన లేదు. మళ్లీ ఈ సంఘటన జరిగింది. అన్యం పున్యం తెలియని చిన్నారులపై జరిగే దాడిలో అవాంఛనీయ సంఘటనలు జరగక ముందే తగు చర్యలు తీసుకుని చిన్నారులను కుక్కల నుంచి కాపాడాలని అయిజ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**మున్సిపల్ కమిషనర్ వివరణ :** ఇట్టి విషయంపై మున్సిపల్ కమిషనర్ సి.సత్యబాబును వివరణ కోరగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఈ విషయంపై అధికారుల ఆదేశాల మేరకు గద్వాల ఏబిసి వారితో కలిసి కుక్కలపై కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం అగ్రిమెంట్ జరిగింది. తొందరలో కుక్కల తీసుకునిపోయివాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి వాటి ఆరోగ్యం బాగు అయినా తరువాత మరల అయిజలో వదిలేస్తాము అని తెలిపారు. కుక్కలకు సంతానం అభివృద్ధి చెందకుండా నిరోదించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.చిన్న పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మటన్, చికెన్ షాప్‌ల వారు కూడా మాంసం వెస్ట్‌ను కూడా రోడ్లపై వేయకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.16 వార్డు మున్సిపల్ చైర్మన్ వార్డు అందులో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని వాటిపై చైర్మన్ తగిన చర్యలు తీసుకోవాలని కాలాని ప్రజలు కోరుతున్నారు.

## సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు



**కల్వకుర్తి, జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనను మెచ్చి కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన పలువురు బీజేపీ యువకులు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీల అమలు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఆ దిశగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో రైతన్నల కుటుంబాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాభిమానాన్ని చురగొని ప్రజా పాలనను కొనసాగిస్తున్న తరుణంలో చాలా మంది యువకులు పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారు భాషమోని జానీ, సంపంగి రాజేందర్, పోతరలపల్లి కిరణ్, ఒర్సు లక్ష్మయ్య, పరుశరాములు, సంపంగి శేఖర్,తుమ్మల అశోక్,గోరటి విజయేందర్, బండి శేఖర్ తదితరులు ఉన్నారు.

## రైతు ఋణమాఫీని రైతు ఖాతాలో జమ చేయాలి



**అమరచింత జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన ఋణమాఫీ ని నేరుగా రైతు ఖాతాలో జమ చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి, కే రాజన్న డిమాండ్ చేశారు. రైతులకు ఋణమాఫీని రైతు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో అమరచింత యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల ఋణమాఫీని బ్యాంకు లోన్ అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేయడం వలన యూనియన్ బ్యాంక్ అధికారులు క్రాప్‌లోన్ రెన్యువల్ ఉంటేనే మాపి వస్తుందని రైతులకు చెప్పడం సమంజసం కాదని తక్షణమే బ్యాంక్ అధికారులు లోన్ అకౌంట్ నుండి రైతు క్రాప్ లోన్ రైతు అకౌంట్‌లోకి వెయ్యాలని ఆయన డిమాండ్ చెశారు. అలాగే యూనియన్ బ్యాంక్ అధికారులు రైతులు తీసుకున్నటువంటి క్రాప్‌లోన్ల రెన్యువల్ చేస్తేనే రైతులకు ఋణమాఫీ వర్తిస్తుందని బ్యాంక్ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు.రైతులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా యూనియన్ బ్యాంక్ అధికారులు తక్షణమే రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఋణమాఫీని రైతుల ఖాతాలోజమ చేయాలని అలాగే రైతుల పెట్టుబడులకు కొత్త ఋణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్‌జిల్లా నాయకులు సిరాజు,సామేలు, భక్తరాజు, ఏసన్న, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**వెల్దండ, జులై25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సీఈఓగా పని చేయుటకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చైర్‌పర్సన్ రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్రికల్చర్ మార్కె టింగ్, అగ్రికల్చర్ డిప్లమా ఉన్నత చదువులు చదివిన వారు అర్హులని, ఆగస్టు 05వ తేదీ వరకు మహిళా సమాఖ్య కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని చైర్ పర్సన్ పేర్కొన్నారు.ఆసక్తికలిగినవారుఈఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సమాజ సేవకురాలు బాలమణికి సన్మానం

**జడ్చర్ల,జులై 25 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో కల్వకుర్తి రోడ్డు ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో సమాజ సేవకురాలు, జాతీయస్థాయి అవార్డులు, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో పొందిన బాలమణి ఘనంగా శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమెన్ దెవల ప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి చేసిన సేవలను కొనియాడారు. సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలుప్రతినిత్యం సామాజిక సేవకార్యక్ర మంలో నిర్వహిస్తూ తనవంతు సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహి స్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, కుట్టు శిక్షణశిబిరం మహిళలు జయమ్మ, సౌజన్య, సింధు, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.


బాలమణిని సన్మానిస్తున్న సభ్యులు

# పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలి

◆ జిల్లా పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్‌గౌడ్


పిఆర్‌టియు టిఎస్ సభ్యత్వం అందజేస్తున్న పిఆర్‌టియు నాయకులు

**ఉప్పునుంతల,జులై 25 ప్రభాతవార్త:** సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే మంజూరు చేయాలని జిల్లా పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులు సూర్య శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బిచ్యనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పిఆర్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అదే విధంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంసానిపల్లి, వెల్టూరు, పెనిమళ్ళ, కెజిబివి పాఠశాలల్లో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ వర్గానికి పదోన్నతులు బదిలీలు చేపట్టి ఉపాధ్యాయ కుటుంబాలలో సంతోషాలను నింపిందని వారన్నారు. అదేవిధంగా జిఓ నం 315 అమలుతో స్థానికతను కోల్పోయి సుదూర ప్రాంతాలకు బదిలీ చేయబడ్డ ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారి సమస్యను పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల పిఆర్‌టియు టిఎస్ సంఘం స్వాగతిస్తుందన్నారు. రాష్ట్రంలో సుమారు 25 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సత్వరమే పిఆర్సి కమిషన్ రిపోర్టును తెప్పించుకొని ఉద్యోగ ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్సిని ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కెజిబివి టీచర్స్‌కు టైం స్కేల్‌ను అక్టోబర్ వరకు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు పిఆర్‌టియు సంఘం ఎల్లవేళలా ముందుంటుందని వారు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్,అజ్మతుల్లా, మల్లికార్జున్,నర్సింహ్మారెడ్డి, అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల సంక్షేమ ప్రదాత వీరారెడ్డి

◆ ఘనంగా మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వీరారెడ్డి జయంతి


అమరచింతలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వీరారెడ్డి జయంతి వేడుకలు

**అమరచింత జులై 25 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల సంక్షేమ ప్రదాతగా నియోజకవర్గంలో పేరుగాంచిన వ్యక్తి వీరారెడ్డి అని నారాయణపేట డిసిసి జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం అమరచింత మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వీరారెడ్డి 77వ జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి చిత్రపటానికి ప్రశాంత్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన కేక్‌కట్ చేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు.అలాగే పట్టణంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిసిసి జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోవీరారెడ్డి ఎమ్మెల్యే పదవీకాలంలో బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పనిచేసే ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసిన ఘనత వీరారెడ్డికే దక్కిందని ఆయన అన్నారు. వీరారెడ్డి హాయంలో చేసిన అభివృద్ధి పనులను ఇప్పటికి ప్రజలు తలుచుకోవడంఅదృష్టంగా భావిస్తానని ఆయన చేసిన సేవలను ప్రజలు గుర్తించుకోవడం హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు. వీరారెడ్డి ఆశయ సాధన కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులుజుబేర్ అహ్మద్, కుమ్మరి బాలస్వామి, చంద్రశేఖర్ రెడ్డి, ఎలక్ట్రిషన్ అయ్యోఖాన్,రాజారెడ్డి, మంగలిరాజు,జాను,డీజే మహిముద్, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వైద్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి

**వనపర్తి టౌన్ జులై 25 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి వైద్య ఆరోగ్యశాఖ సమీక్షా సమావేశం, సమావేశంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్ మేల్ ఫిమేల్ పాల్గొన్నారు. ఈ క్రింది విషయాలను చర్చించడం, వైద్య సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. 1 సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోని కావలసిన అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించడం జరిగింది.2 గ్రామాలలో నీటి నిలువ ఉన్న ప్రదేశాలను గుర్తించి దోమల అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలి అని ఆదేశించారు. మతా శిశు సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీని ఆన్లైన్ రిజిస్ట్రేషన్ తో పాటు 100 శాతం నాలుగు చెకప్‌లు చేయించాలని ఆదేశించడం జరిగింది. ఐరిస్కు ఉన్న గర్భిణీ స్త్రీలను,రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలను కచ్చితంగా గుర్తించవలెను, ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీకి బర్త్ ప్లాన్ చేయాలని తెలియజేసినారు. ప్రతి యొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి సర్వీస్‌ను ఆన్లైన్ అప్డేషన్ 100 శాతం పూర్తి చేయాలి, ప్రతి ఒక్క టీబీ శిశువుకు వ్యాధి నిరోధక టీకాలను అందె విధంగా చూడాలని తెలియజేసినారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ బి శ్రీనివాసులు,డాక్టర్ సాయినాథ్‌రెడ్డి పిఓ,డాక్టర్ ఝాన్సీ పిఓ,డాక్టర్ వంశీకృష్ణ పిఓ, డాక్టర్ మంజుల పిఓ, డాక్టర్ పరిమలా పిఓ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

# విద్యరంగ సమస్యలను పరిష్కరించాలి

### మధ్యాహ్నం భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ వనపర్తి ఉపాధ్యక్షులు మొగలి


మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**కొత్తకోట జులై 25 ప్రభాతవార్త:** విద్యరంగ సమస్యలను పరిష్కరించి మధ్యాహ్నం భోజనా పథకానికి అధిక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ వనపర్తి ఉపాధ్యక్షులు మొగలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భారత విద్యార్ధి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అల్పాహారం రాగి జవాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మొగలి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న డబ్బులు ఇప్పటివరకు వంట వర్కర్లకు డబ్బులు చెల్లించలేదని విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఉన్నటువంటి మధ్యాహ్న భోజన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌లో 24-25కి గాను 21.2922 కోట్ల రూపాయలు విద్య రంగానికి కేటాయింపు మొత్తం7.3 శాతం విద్య రంగానికి కేటాయింపు గతం కన్నా 0.3 శాతం తక్కువ బడ్జెట్ కేటాయించారని తెలిపారు. ఈ విధంగా అరకురాని బడ్జెట్ విద్యారంగానికి కేటాయిస్తే పేద మధ్యతరగతి విద్యార్థులు చాలా తీవ్రంగా నష్టపోతారని, స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్ వంటి బకాయిలు కూడా విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు లక్ష్మణ్, రాజవర్ధన్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు, పేద ప్రజలకు వ్యతిరేకమైన కేంద్ర బడ్జెట్



కొత్తకోట చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కార్మికులు

**కొత్తకోట జులై 25 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో సామాన్య పేద ప్రజలకు కార్మికులకు ఎటువంటి ఉపశమనం కలగలేదని పైగా ఆయా వర్గాలకు కోత విధించిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బలి నిక్సన్ ఆరోపించారు. కొత్తకోట పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం కార్మికులచే కేంద్ర బడ్జెట్ పై నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్లో పేదలు రైతులకు సంబంధించిన సబ్సీడీలకు కేంద్ర ప్రభుత్వం కోత విధించిందని ఆహారం వంట గ్యాస్ పెట్రోలియం యూరియా వంటి వాటికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించిందని అన్నారు. సామాన్యులకు భారాలు సంపన్నులకు వరాలు సామాన్యులకు మాటల్లో కార్పొరేట్లకు మూటల్లో వర్తించే కేంద్ర ప్రభుత్వం తాజా బబ్జెట్ ను ప్రవేశపెట్టిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపు లేకుండా వివక్షత చూపించిందని ఆరోపించారు. అండగా నిలిచిన వారికి మాత్రం దండిగా నిధులు అమలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బీహార్ ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీల సహకారంతో బిజెపి ప్రభుత్వంఏర్పడిన నేపథ్యంలో ఈ బడ్జెట్ పెట్టారని రాజీ పడిపోవడం సర్దుబాటు పొందడంలో ప్రధానంగా ఉందని అన్నారు. ఆర్థిక మంత్రి ఉద్యోగ కల్పనపై అరచేతిలో వైకుంఠం చూపించారని ఉద్యోగుల కల్పనకు కచ్చితంగా తీసుకునే చర్యలకు సంబంధించిన ప్రణాళిక ఈ బడ్జెట్‌లో ఎక్కడ కనిపించడం లేదని విమర్శించారు. అతి తక్కువ ఉద్యోగాలు ఉండడంతో పదుల లక్షల సఖ్యలో యువత నిరుద్యోగులుగా ఉన్నారని చెప్పారు.సామాన్యులు నిత్యం వాడుకుంటున్నా ఆహార ధాన్యాలు పప్పు ధాన్యాలు తదితర అనేక ధరలు రోజురోజుకు పెరిగి కష్టాల పాలవుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హామాలి కార్మిక సంఘం అధ్యక్షులు పెద్ద గొల్ల కురుమన్న, కోశాధికారి డి కురుమన్న, కార్మికులు కదిరే లక్ష్మన్న, రాచాల నాగన్న, మన్యం, నెల్లూరు రాములు,కదిరే బాబు, దేశి హనుమంతు, మధు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

**కొత్తకోట జులై 25 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి పర్యవరణాన్ని కాపాడాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. గురువారం కొత్తకోట పోలీస్ స్టేషన్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మంచి పూలతోటలను, పండ్ల మొక్కలను నాటలని కోరారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడినవారం అవుతామని తెలిపారు. ఇటీవల పోలీస్ శాఖ లో పని చేస్తున్న కృష్ణ సాగర్‌ను అందరు ఆదర్శంగా తీసుకోని మొక్కలు నాటలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ మంజునాథ్ రెడ్డి, ఏఎస్ఐ సాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటుతున్న సీఐ, ఎస్సై

### తుక్కుగూడ నుంచి కల్వకుర్తి ఆరు లైన్ల రహదారి కోసం

## కేంద్ర ఆర్‌అండ్‌బి శాఖ మంత్రికి వినతి


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినత పత్రం అందజేస్తున్న తల్లోజు ఆచారి

**కల్వకుర్తి, జులై 25 ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని గురువారం ఆయన చాంబర్‌లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి కలిసి తుక్కుగూడ నుంచి కల్వకుర్తి ఆరు లైన్ల రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. తుక్కుగూడ నుంచి కల్వకుర్తి వరకు ఆరు లైన్ల రహదారిని నిర్మించాలని, అదే విధంగా కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు నాలుగు లైన్ల రహదారిని మంజూరు చేయాలని కోరారు. వాహనాల రద్దీ దృష్ట్యా రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయన పేర్కొన్నారు.దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలోనాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రావు, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, సోలంకి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేద్దాం

### - కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జులై25 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గానికి ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటి సారి ముఖ్యమంత్రి హోదాలో ఈ నెల 28న విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ తరుపు నుంచి భారీ ఘన స్వాగతం పలుకాలని, కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణ పక్కనున్న స్థలంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరైవిజయవంతం చేయాలనిఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఠాకూర్ బాలాజీసింగ్, బృంగి ఆనంద్‌కుమార్, సూదిని రాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, యాటనర్సింహ్మా, అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మోతిలాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## వార్డులో శ్రమదానం

**గద్వాల, జులై 25 ప్రభాతవార్త:** 18వ వార్డులో గురువారం ఉదయం మన వార్డు, మన శుభ్రత ,మన ఆరోగ్యం పేరిట శ్రమదానం కార్యక్రమంలో వార్డు ప్రజలు ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18వ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన ఉపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి జిల్లా వికలాంగుల సంఘ అధ్యక్షులు టెంకాయల చంటి, దేవేందర్‌రెడ్డి, గంగులు, మునిస్వామి,ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు తదితరులు పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ విధంగా 18వ వార్డులో కాలనీవాసులందరూ వారి వారి ఇంటి ముందు ప్రతి ఒక్కరు మొక్కలు నాటుకుని సంరక్షించి 18వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దాలని 18వవార్డు మన వార్డు మన శుభ్రత మన ఆరోగ్యం టీం సభ్యులు కోరుతున్నారు.

## కబ్రిస్తాన్ ఆక్రమించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి


ఆత్మకూరులోని కబ్రిస్తాన్ స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం కార్యదర్శి జబ్బర్

**ఆత్మకూర్ జులై25 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఓ వర్గానికి చెందిన కబ్రిస్తాన్ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులకు తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ డిమాండ్ చేశారు గడిచిన వారం కబ్రిస్తాన్ స్థలాన్ని ఆక్రమించారంటూ మత పెద్దలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినటప్పటికి పోలీసు ఉన్నత అధికారులు విచారణ నిర్వహించినప్పటికి ఇప్పటివరకు దోషులను అరెస్టు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని తహాశీల్దార్ రాజుతో అయినా ఈ విషయం పై సంపూర్ణంగా చర్చించారు. కబ్రిస్తాన్ స్థలాన్నిఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులపై ఉందని అధికారులు తక్షణమే స్పందించి సమాధులు తగ్గిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లుగా ఆయన హెచ్చరించారు.ముస్లిం మత పెద్దలకోరిక మేరకు కబ్రిస్తాన్ స్థలాన్ని రక్షించాలంటే ముందుగా ప్రహరీ గోడ నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేవలం ఒక వ్యక్తి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు స్థలాన్ని ఆక్రమిస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వివరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజు, బుచ్చన్న ,వెంకటేష్,అజయ్,అర్యన్,రమేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించుకోవాలి



**ఆత్మకూర్ జులై25 ప్రభాతవార్త :** సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యతను తీసుకో వాలని ఆత్మ కూర్ ఎస్సై నరేందర్ పిలుపుని చ్చారు. గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో యూనిఇయన్ నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటా రు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్లో ప్రతి ఒక్కరూ తమ ఇంటి స్థలాల ముందుగానే ప్రధాన రహదారుల ఇరువైపులా గాని మొక్కలు నాటి సంరక్షించుకోవాలని రాబోయే భవిష్య త్ తరాలకు హరితహారం కార్యక్రమం పేరిట మొక్కలను పెంచి పోషించి అందించాల్సిన బాధ్యతను తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాలుష్య నివారణ సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్, శ్రీరామ్‌నగర్ దేవరపల్లి, తిప్పడంపల్లి, జూరాల గ్రామాలకు చెందిన ఆటో యూనియన్ నాయకులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్వాన్నస్థితిలో మండల రోడ్డు

- అడుగడుగునా గుంతల మయం
- ఇరుకైన రోడ్డుకిరువైపులా ముళ్లచెట్లే
- పట్టణంలో మారుమూల ప్రాంతంగా మండల రోడ్డు

**భూత్పూర్, జూలై 25, ప్రభాతవార్త:** జాతీయ రహదారి 44కు కూడలిగా ఉంటూ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెంది అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న భూత్పూర్ పట్టణంలో మండల రోడ్డు మారుమూల ప్రాంతాన్ని తలపిస్తోంది. నిత్యం ఈ రోడ్డు తహసిల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలలకు వేల సంఖ్యలో వచ్చే విద్యార్థులు, ప్రజలతో రద్దీగా ఉంటుంది. చిత్రమేమిటంటే ఈ రోడ్డు ఎన్నోఏళ్ల క్రితం వేసిన కంకర రోడ్డు, రోడ్డుకిరువైపు సర్కారు తుమ్మ ముళ్లచెట్లు, పొదలతో నిండి అడుగడుగునా గుంతల మయంగా మారి ఇటు పాదచారులు, అటు వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. మండల మెజిస్ట్రేట్, తహసిల్దార్ రోడ్డు పరిస్థితే ఇలా ఉంటూ మామూలు రోడ్లపరిస్థితేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటి లోని పదివార్డులలో నాలుగోవార్డయిన తహసిల్దార్ కార్యాలయం రోడ్డు ద్వారా కార్యాలయాలు, కళాశాలలకు నిత్యం వచ్చే వాహనదారులు, పాదచారులు, సామాన్యులుఅడుగు మీద అడుగేసి నడవాల్సిప దుస్థితి ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని నడవడానికి వీలు లేకుండా ఉన్న మండల, కళాశాలల రోడ్డును వెంటనే మరమ్మ త్తులు చేయించి నిత్యం వేల సంఖ్యలో వచ్చే ప్రజలు, విద్యార్థుల రోడ్డు కష్టాల్ని దూరం చేయాలని గ్రామస్తులతో అధికారులు, విద్యార్థులు కోరుతున్నారు.



అడుగడుగునా గుంతల మయమైన రోడ్డు



రోడ్డుకిరువైపుల ఏపుగా పెరిగిన సర్కారు తుమ్మచెట్లు

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి



బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీరం సుబ్బారెడ్డి

**వనపర్తి ప్రతినిధి జులై25 ప్రభాతవార్త:** కొత్త చట్టాలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు, గరువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు కొత్త చట్టాలపూ అవగాహన కల్పించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిక కేంద్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త చట్టాలను తీసుకువచ్చిందని వివరించారు. న్యాయ నిపుణులు, మేధావులు, విద్యావంతులు, యువత, విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పింస్తున్నారని ముఖ్యంగా విద్యార్థులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు, బాలికలపై జరుగుతున్న అగత్యాలకు సంబంధించి ఫోక్స్ యాక్ట్ 2012, పోషో యాక్ట్ 2013 చట్టాల గురించి విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగించారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడడం కాని ఫోన్లో చాటింగ్ చేయడం లాంటివి చేయవద్దని అన్నారు. అలాగే సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగితే సంబంధించిన హెల్ప్ లైన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. హెల్ప్ లైన్ నెంబర్లు 1930, 1098,18110014568 ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం బృందం భాస్కర్ శ్రీవాణి సలోమి సుమ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీర్లగుట్ట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి ఆధ్వర్యంలో వసతి గృహంలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్షాకాలంప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహంలోని ఆవరణ చుట్టూ పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి జీవిత ను ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగు మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సహజంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందువలన విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వసతి గృహంలోని వంటగది పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వసతి గృహ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలనివాటిని ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, వసతి గృహ సంక్షేమ అధికారి జీవితమెడికల్‌సిబ్బంది, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా భరోసా ఊసేలేదు

- పియుజెఎస్‌సి ఛైర్మన్ బత్తిని రాము



**మహబూబ్‌నగర్, జులై 25 ప్రభాతవార్త :** విద్యా రంగానికి ఆశించిన మేర బడ్జెట్ పెట్టలేదని గత కొన్ని సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, మెస్ బకాయిల విడుదల చేయలేదని పాలమూరు విశ్వ విద్యాలయం జెఎసి ఛైర్మన్ బత్తిని రాము ఆరోపించారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం పూర్తిస్థాయి బడ్జెట్ కల్పన జరగలేదన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు పెంచలేదని పేర్కొన్నారు. విద్యాభరోసా ఊసే ఎత్తలేదని పేర్కొన్నారు. విద్యా భరోసా ఊసే ఎత్తలేదని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ఏడాదిలోగా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలు గడుస్తున్న విద్యాభరోసా పథకాన్ని విస్మరించడం సరికాదన్నారు.

## బదిలీపై వెళ్లిన వారికి సన్మానం

**కెటిదొడ్డి, జులై 25 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న మండల పంచాయతీ అధికారి అబ్దుల్ సయ్యద్‌ఖాన్ సాధారణ బదిలీపై ధరూర్ మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాములు నాయక్, ఎపిఓ అనిల్, కంప్యూటర్ ఆపరేటర్ ఖయ్యూం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**కల్వకుర్తి, జూలై25 ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రులకు పలు రోగాలతో వచ్చే ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వైద్యులను ఆదేశించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని 50పడకల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో మొత్తం ఎంత మంది వైద్యులున్నారు, విధులకు హాజరైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, రాజవ్ ఆరోగ్యశ్రీ సెంటర్, దయాలసిస్‌సెంటర్, ఓపీ అత్యవసర వైద్య విభాగాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించి రక్త నిల్వలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడు ఆసుపత్రిలో అన్నిరకాల రక్త నిల్వలను ఉంచుకోవాలని ఆదేశించారు. పాముకాటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెల్దండ మండలం కోనేటివాడతాండకు చెందిన లోక్యానాయక్, జ్వరంతో బాధపడుతున్న చారకొండ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సాయి, వివిధ రోగాలతో చికిత్స పొందుతున్న పలువురు రోగులను కలెక్టర్ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సరఫరా కావాల్సిన మందులు అందుతున్నాయా లేదా అని పర్తి సమాచారాన్ని అందజేయాలని ఆదేశించారు. ఎప్పుడు ఎలాంటి సమస్యలతో, రోగులు వస్తారో తెలియని పరిస్థితి కాబట్టి వైద్యులు ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటి వరకు ఎంత మందికి వైద్య సహాయం అందించారని కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు నార్మల్ డెలివరీలు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో ఏమైన సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి వైద్యులు శివరాం, అన్నపూర్ణ, స్వర్ణలత, యశోధభాయి, రోహిత్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- హస్టళ్లలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలి : గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్
- ఉండవల్లి మండల కేంద్రంలో బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఇటిక్యాల జులై 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం ఉండవెల్లి మండలంలోని ఎస్సి బాలుర వసతి గృహంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో రూమ్స్, త్రాగునీటి సరఫరా, కిచెన్ రూం, పరిశుభ్రతను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య ఏ తరగతిలో చదువుతున్నారు. ఎన్ని రూమ్స్ ఉన్నాయి. పాఠశాల టైమింగ్స్ హస్టల్ నుండి పాఠశాలకు ఎంత దూరమని అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో 120మంది విద్యార్థులు, 3గదులు, 4వ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు, ఒక వంట మనిషి, వాచ్‌మెన్, ఇద్దరు ట్యూటర్స్ ఉన్నారని జిల్లా కలెక్టర్‌కు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటోందా? అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. పదవతరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోమన్నారు. ప్రభుత్వ పాతవసతి గృహాన్ని కూడా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విద్య, భోజనం మెనూప్రకారంగా అందించాలని సూచించారు. అనంతరం అలంపూరు జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని పిజెపి క్యాంపులోని ప్రభుత్వ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తికాకుండా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆసుపత్రి సిబ్బందికి మెరుగైన వసతులు సౌకర్యాలు కల్పించాల న్నారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శ్వేతా ప్రియదర్శిని, తాహసిల్దార్ సాలిముద్దిన్, ఎఎస్‌డబ్లు సరోజ వసతి గృహాల ప్రత్యేక అధికారులు రామకృష్ణ తదితరులు ఉన్నారు.



ఉండవెల్లి హస్టల్లో వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



విద్యార్థుల విద్య సామర్థ్యాలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్



హస్టల్ విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం..!

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి

**చిన్నచింతకుంట, జులై 25 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలి, పార్టీ గెలుపు కోసం సమన్వయంతో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బిజెపి మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులుదశరథ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పద్మజారెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మండల కార్యవర్గ సమావేశాన్ని ప్రారంభించారు. మండల సమస్యలపై రాజకీయ తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. వీటికి కార్యవర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా పద్మజారెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటికే వాటిని అమలుచేయలేక చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలపై ప్రజలను చైతన్యం చేస్తూ పార్టీ కార్యకర్తలు అండగా నిలవాలనిఆమె కోరారు.



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి

**బిసి డిక్లరేషన్ అమలు చేయాలి :** ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలో ప్రకటించిన బిసి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బిజెపి ఓబిసి మోర్చా నేతలు డిమాండ్ చేశారు. ఓటు బ్యాంకుకు బిసిలను వాడుకొని గాలికి వదిలేశారని నేతలు ఆరోపించారు. ఓబిసి ఆధ్వర్యంలోతహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ క్రాంతిగౌడ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుర్వరమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, జడలయ్య, నాయకులు ఎర్ర వెంకటన్న, గుబ్బశ్రీను, మహేష్‌యాదవ్, నరసింహులుయాదవ్, బాలస్వామి, రుతుకుమార్, మాసన్న, బాలచందర్, నరసింహ పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న బిజెపి యువమోర్చా నాయకులు

# తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం

**అమరచింత జులై25 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసి తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని సిపిఎం జిల్లా నాయకులు బి వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, ఎస్ అజయ్ అన్నారు. గరువారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని ఎన్నికలలో బిజెపి పార్టీ హామీ ఇచ్చి పాలమూరు రంగారెడ్డి ప్రజలను మోసం చేశారని వారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీకి 8 మంది ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమని వారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో 8 మంది బిజెపి ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్‌చేశారు. బిజెపి ప్రభుత్వాన్ని కాపాడే మిత్రపక్షులైన బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్రం భారీ బడ్జెట్ కేటాయించిందని వారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు బుచ్చన్న, శ్యాం సుందర్, శ్రీనివాసులు, కర్ణ, రసూల్, కావాలిఅంజి, ఆటో వెంకటేష్, జహంగీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

## ఆర్థిక సాయం అందజేత

**పెద్దమందడి జులై25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్న మందడి గ్రామానికి చెందిన జెనిగె పెద్ద రాములు మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి తెలుపగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మృతుని దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో మాజీ ఉప సర్పంచ్ డిశ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ కురుమూర్తి, కాంగ్రెస్ నాయకులు రమేష్ యాదవ్, తదితరులు ఉన్నారు.



# ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయొద్దు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

యువకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, గుర్తు తెలియని అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్ చాటింగ్‌కు దూరంగా ఉండాలని, ఓటిపిలు వస్తే ఎవరికి చెప్పవద్దని ఎస్పీ సూచించారు. లాటరీలు, బ్యాంకుల రివార్డు పేరిట జాబ్స్, కమిషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపి మోసం చేస్తున్నారని, బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండని, మీ ఏటిఎం పని చేయడం లేదని, కారు గెల్చుకున్నాని, మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ తెలియకుండానే డబ్బులు కాజేస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఏపికె ఫైల్స్ డౌన్‌లోడ్ చేయొద్దని అలాగే పోలీస్ అధికారుల ఫొటోలు డిపిగా పెట్టుకొని మీపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని మిమ్మల్ని భయపెట్టొచ్చు. కావున సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు గోల్డెన్ అవర్ (గంటలోపు) కాల్‌చేసి వివరాలు తెలియజేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణ కోసం పలు అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అలాగే మహబూబ్‌నగర్ సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్టాగ్రామ్‌ని ఫాలో అయితే ప్రతినిత్యం అప్డేట్స్ ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## జడ్చర్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టి నెగ్గడంతో అందరి చూపు జడ్చర్ల మున్సిపాలిటీపైనే పడింది. తదుపరి ఛైర్‌పర్సన్‌గా ఎవరిని ఎన్నుకుంటున్నారనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది. మాజీ ఎమ్మెల్యే చర్లకోళ్ల లక్ష్మారెడ్డి ఆశీస్సులున్న వారికే ఛైర్మన్ పీఠం వరించనున్నట్లు తెలుస్తున్నది.

**అవినీతి ఆరోపణలే కారణమా...**

జడ్చర్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి భర్త దోరేపల్లి రవిందర్‌పై అవినీతి ఆరోపణలు ఉన్న కారణంగానే గత కొన్ని నెలలుగా అవిశ్వాసం చర్చ జరుగుతున్నది. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆశీస్సులతో ఛైర్‌పర్సన్ పదవి పొందిన దోరేపల్లి లక్ష్మీ రవిందర్ మూడేళ్ల కాలంలోనే పలు వివాదాలకు కారణమయ్యారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఛైర్‌పర్సన్ భర్తపై మున్సిపాలిటీలో పందుల వ్యవహారానికి సంబంధించి కూడా కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఛైర్‌పర్సన్ భర్త వల్ల మున్సిపల్ పాలకవర్గం మొత్తానికి అవినీతి ఆరోపణలు మోపుతున్న నేపథ్యంలో కౌన్సిలర్లు పలుమార్లు సమావేశమై ఈ నిర్ణయానికి వచ్చారు. ఒకరు చేసిన తప్పుకు పాలకవర్గంపై నిందలు మోపడం తగదని పలు సందర్భాల్లో చెబుతూ వచ్చారు. ఇదే విషయమై పలు సందర్భాల్లో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి దృష్టికి కౌన్సిలర్లు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎంతో సొంత పార్టీ ఛైర్‌పర్సన్‌పైనే అవిశ్వాసం పెట్టడం చర్చనీయంశంగా మారింది.

## మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

మొక్కలను పరిశీలించారు. రెమద్దుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలను సంర్శించిన ఆయన అమ్మ ఆదర్శ పాఠశాలను పనులను పరిశీలించడమే కాకుండా విద్యార్థులతో ముచ్చటించారు. బోధిస్తున్న మాధ్యమం పై వివరాలు తెలుసుకుని విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం పాన్‌గల్ మండలంలోని పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఎంతమంది ఒ.పి లు వచ్చారు అనేది రిజిస్టర్ లు పరిశీలించారు. పి హెచ్ పి లో ఉన్న మందులు నిలువలు, సమస్యలపై ఆరాతీశారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల మరమ్మత్తు పనులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాన్‌గల్ తహశీల్దార్ కార్యాలయంలో సందర్శించి ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు తీసుకున్నారు. త్వరగా పరిష్కరించి ఆర్డీఓ లాగిన్‌కు పంపించాలని తహశీల్దార్‌నే ఆదేశించారు. జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, పాన్‌గల్ తహశీల్దార్, ఎంపీడీఓ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## ఎస్సీ గురుకుల కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్

**బిజినపల్లి, జులై 25 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్సీ గురుకుల జనరల్, ఒకేషనల్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకోసం ఈనెల 26,27 తేదీలలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు బిజినపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా జనరల్‌గురుకుల, ఒకేషనల్ జూనియర్ కాలేజీలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాలికలకు ఈనెల 26వ తేదీన (రామిరెడ్డిగూడ), గురుకుల పాఠశాల మహబూబ్‌నగర్ నందు, 27వ తేదీన బాలురకు (జెపి నగర్)గురుకుల పాఠశాలకల్వకుర్తిలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని ఆమె వివరించారు. పదవ తరగతి పాసైన విద్యార్థినీ, విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరవ్వాలని ఆమె సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

**వనపర్తి టౌన్ జులై 25 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని టౌన్ ఎస్సై జయన్న నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురు వ్యక్తులు పట్టుబడగా వనపర్తి న్యాయస్థానం ముందు హాజరు పరచగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు పట్టణ ఎస్సై జయన్న తెలిపారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో చిన్నచింతకుంట మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ కు రెండు రోజులు శిక్ష విధించినట్లు ఇదే కేసులో వనపర్తి పట్టణానికి చెందిన రాంబాబు అనే వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష దొండకుంటపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ కు ఒకరోజు శిక్ష వనపర్తి పట్టణానికి చెందిన ఈశ్వర్ ప్రసాద్ అనే వ్యక్తికి ఒకరోజు శిక్షణ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చుప్పినట్లు ఎస్సై జయన్న తెలిపారు, వనపర్తి న్యాయమూర్తి శ్రీలత తీర్పు మేరకు డ్రంక్ డ్రైవ్‌లో పై వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్నట్లు టౌన్ ఎస్సై జయన్న తెలిపారు. వనపర్తి పట్టణంలోని విచ్చలవిడిగా మద్యమును సేవించి వాహనాలు నడుపుతున్న వాహనదారులకు శిక్షలువిధించడమే కాక జరిమానాలు కూడా విధిస్తున్నట్లు ప్రతి ఒక్కరు మద్యం సేవించి వాహనాలు నడిపే విధానాన్ని స్వస్తిపలికారని అదేవిధంగా ఎలాంటి లైసెన్సులు లేకుండాత్రిపుల్ రైడింగ్ చేసినా కూడాకటక చర్యలు తీసుకుంటామని పట్టణంలో శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలి పెట్టే ప్రసక్తేలేదనిఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. వయసుతో సంబంధం లేకున్నా ఏ వ్యక్తి అయినా చట్టాలకు లోబడి పని చేయాలని ఆయన సూచించారు, ఎస్సై జయన్న నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పురోగతి పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర బడ్జెట్‌ల్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

**ఆత్మకూర్ జులై 25 ప్రభాతవార్త :** విద్యారంగానికి అతి తక్కువ నిధులు 7.31 శాతం మాత్రమే కేటాయించడం అంటే ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేయడమే విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నేడే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యారంగాన్ని బడ్జెట్లో కేటాయింపులు చాలా వివక్ష చూపారు (21.292) కోట్లు అతి తక్కువ నిధులు విద్యారంగం మొత్తం నిర్వీర్యమైందని గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యారంగాన్ని వివక్ష చూపుతున్నారని అన్నారు. ప్రజలు అధికారమిస్తే ప్రజా ప్రబుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వమని విద్యారంగాన్ని బడ్జెట్లో 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారు. కానీ బడ్జెట్ కేటాయించలేదు. కొత్తగాపాఠశాలలు కళాశాలలు విశ్వవిద్యాలయాలుఇంజనీ రింగ్ మెడికల్ పాలిటెక్నికల్ కళాశాలలు లేవని ఉన్నవాటి సమస్యలు గాలికి వదిలేసిందని అర్థమవుతుంది స్కాలర్షిప్ ఫీజు రీమార్స్మెంట్ గురుకులాల సంక్షే మ వసతులుగృహాలు సొంత భవనాలుమొస్సు బకాయిలు మౌలిక సదుపా యాలు కొరకు ఏ మాత్రం సరిపోయే పరిస్థితి లేదు. కేటాయించిన కొద్దిపాటి నిధులు అధ్యాపకులు ఉపాధ్యాయులకు ప్రొఫెసర్ జీవితాలకు సరిపోతాయి విశ్వవిద్యాలయాలు అభివృద్ధి కేవలం 500 కోట్లు కేటాయించడం విడ్డూరం ఈ నిధులతో ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయడం సాధ్యం కాదు గత పాలకులు ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యను ప్రోత్సహించారు. ఇప్పుడు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 30 శాతం నిధులు కేటాయిస్తే తప్ప ఇంతవరకు విద్యను జరిగిననష్టం సరిచేయవలేము అందుకే ప్రస్తుతం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించడం ఏ మాత్రం సరిపోవు కావున విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఒక ప్రకటనలో కోరారు.